క్లుప్తంగా

నేడు అయ్యప్ప పడిపూజ

రాజమహేంద్రవరం సిటీ: జాంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప పడిపూజా మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జాంపేట అయ్యప్ప భక్త బృందం సభ్యుడు ముప్పన శ్రీనివాస్ శనివారం తెలిపారు. కీర్తి శేషులు పందు గురుస్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అయ్యప్ప మాలధారులు, శివస్వాములు, భవానీలు తరలి రావాలని కోరారు.

అద్దంకి రాజాయోనాకు సత్కారం



రాజాయోనాను సత్కరిస్తున్న ప్రతాప్, సత్యనారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: నన్నయ యూనివర్సిటీ, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గోదావరి కవనోత్సవంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజాయోనాను సత్కరించారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ద్వారా దశాబ్ద కాలంగా చేస్తున్న సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవల్ని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశామని శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ టి.పార్థసారథి, కావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశ్రమల ప్రోత్సాహానికి యూబీఐ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఎం బిజూ వాసుదేవన్

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరంతరం కృషి చేస్తోందని ఆ బ్యాంక్ సీజీఎం బిజూ వాసుదేవన్ అన్నారు. ఆ బ్యాంక్ కార్యాలయంలో శనివారం క్లస్టర్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 195 క్లస్టర్లలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ క్లస్టర్ ద్వారా ఈ ప్రాంతంలో కార్పెంటర్లు లబ్ధి పొందాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. రీజినల్ హెడ్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ చేతివృత్తుల వారు క్లస్టర్‌గా ఏర్పడి ఆధునిక సాంకేతికత ద్వారా విలువైన ఉత్పత్తుల తయారీకి బ్యాంకులు ఎప్పుడు సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు వాణీవర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కడియం: దుళ్లలోని శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు (బాబీ) ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. స్వామివారికి సహస్ర కలశాభిషేకం, అర్చనలు జరిపించారు. అనంతరం ఏటా మాదిరిగానే భారీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి దుళ్ల గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక యువత, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని ఆదెమ్మదిబ్బ వాంబే కాలనీకి చెందిన తురాయి పూజ శనివారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదెమ్మ దిబ్బ వాంబే కాలనీకి చెందిన 31 ఏళ్ల తురాయి రాము ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఎస్సై సుభానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీవారపుపేటలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలోని రెండు టీవీలు, రెండు గ్యాస్ సిలిండర్లు, ఒక కీపాడ్ ఫోన్‌ను గుర్తుతెలియన వ్యక్తులు చోరీ చేశారని లక్ష్మీవారపుపేట గాదిరెడ్డివీధి చెందిన రంగారావు శనివారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఈ నెల 7వ తేదీ రాత్రి హుకుంపేటకు డ్యూటీ నిమిత్తం వెళ్లారు. తిరిగి 8వ తేదీ ఉదయం ఇంటికి వచ్చారు. లోపలకు వెళ్లగా ఇంటిలోని రెండు టీవీలు, రెండు గ్యాస్ సిలిండర్లు, ఒక కీపాడ్ ఫోన్ కనిపించలేదు. ఎస్సై సుభానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి తీరంలో దాహార్తి

- ధవళేశ్వరంలో తాగునీటి కష్టాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పాడైన రక్షిత మంచినీటి పథకం పంపు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



ధవళేశ్వరంలోని రక్షిత తాగునీటి పథకం ట్యాంక్

ధవళేశ్వరం: సాధారణంగా మెట్ట ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంటుంది. తాగునీటి ప్రజలు ఎదురుచూస్తూ ఉంటారు. అరకొర వచ్చే నీటితో సరిపెట్టుకుంటూ ఉంటారు. కానీ పక్కనే గోదావరి ఉండి కూడా నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడితే ఆ బాధ వర్ణనాతీతం. ధవళేశ్వరం వాసులు దాదాపు మూడు నెలలుగా అవస్థలు పడుతున్నారు. ధవళేశ్వరం అనగానే అందరికీ కాటన్ బ్యారేజీ గుర్తుకు వస్తుంది. దాని ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోని సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందుతోంది. బ్యారేజీ కారణంగా రెండు జిల్లాలు సస్యశ్యామలంగా మారాయన్నది అందరికీ తెలిసిందే. అయితే అంతటి గొప్ప బ్యారేజీ ఉన్న గ్రామంలో తాగునీటి కష్టాలు అంటే నిజంగా విచిత్రమే. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ఈ సమస్య ఏర్పడింది.

అరకొరగా నీరు

ధవళేశ్వరం జనార్దనస్వామి కొండపై ఉన్న రక్షిత మంచినీటి పథకం నుంచి గ్రామంలోని సుమారు 25 వేల మందికి నీటి సరఫరా జరుగుతుంది. అయితే గోదావరి నుంచి నీటిని తోడే పంపు పాడైపోవడంతో సబ్ మెర్సిబల్ పంపుల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారు. అది కూడా ఫలనా సమయంలో నీటిని విడుదల చేస్తామన్న సమాచారం ఇవ్వాలన్నది కూడా అధికారులకు పట్టదు. వారంలో రెండు మూడు రోజులు అరకొరగా నీటిని విడుదల చేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో పనులు మానుకొని నీటి కోసం ఎదురుచూడాల్సిన దయనీయ పరిస్థితి ధవళేశ్వరం గ్రామంలో నెలకొంది.

సమస్య పరిష్కారానికి చర్యలేవి

ట్యాంక్‌పై పంపు రిపేర్ కావడంతో తొలుత కొత్తది కొనుగోలు చేస్తామని కొన్ని రోజులు వంకలు చెబుతూ వచ్చారు. తరువాత మరమ్మత్తులు చేయిస్తామంటున్నారు. దీంతో ధవళేశ్వరంలో గ్రామంలోని గొల్లపేట, బోటాఫీసువీధి, రథం వీధి, జంగాల వీధి, మసీదు వీధి, కొండమెరక, పోలీస్ స్టేషన్ వీధి, జలారుపేట, వాడపేట, సున్నంబట్టీ వీధి, కొత్తపేట, కాటన్‌పేట, పాతపేట తదితర వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన తాగునీటి సరఫరా విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చూపడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. రక్షిత మంచినీటి పథకం పంపు సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతిరోజూ పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్లక్ష్యం తగదు



రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన సమస్యను పరిష్కరించడంతో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను ఇప్పటికే పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. దాన్ని వెంటనే పరిష్కరించకుంటే ప్రజల పక్షాన పోరాడతాం.

– ఒంటిద్దు స్వామి,
బీజేపీ రూరల్ నియోజకవర్గ మాజీ

రుడా.. కనపడలేదా..



ఆజాద్ చౌక్‌లో సెంటర్ పనిచేయని గడియారం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ఆజాద్ చౌక్‌లో రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో లక్షల రూపాయలతో నిర్మించిన గడియారం పనితీరు మూణాళ్ల ముచ్చటగా మారింది. కొద్ది నెలల క్రితం ప్రారంభించిన ఈ క్లాక్ పాడైపోయి తిరగడం మానేసింది. నగర నడిబొడ్డున గల ఈ ప్రాంతంలో ముస్లింలు అధికంగా నివసిస్తుంటారు. పాడైపోయిన గడియారానికి మరమ్మతులు చేయించడాన్ని అధికారులు మర్చిపోయారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ అభ్యర్థి నారాయణరావుకు మద్దతు తెలుపుతున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు అన్నారు. స్థానిక తాడితోట సంహిత కన్వెన్షన్ హాల్లో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషోపాధ్యాయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి భాషోపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరై గంధం నారాయణరావుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో జరిగే ఉపాధ్యాయ శాసన మండలి ఉప ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను శాసనమండలిలో చర్చించి ప్రభుత్వం ద్వారా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి నిరంతర కృషి



మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న కేశవభట్ల శ్రీనివాసరావు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యాభివృద్ధికి కేశవభట్ల ఛారిటబుల్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని ఆ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఆల్కాట్ తోట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, నాలుగు కుర్చీలను అందించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి కళ్లజోళ్లు అందించామన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అన్నదాత నాగరాజు, చిటికెన సత్యనారాయణ , బండారు శ్రీను, సుంకర చంద్రమౌళి, కె.సతీష్ బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి



ప్రభుత్వాసుపత్రి వద్ద ఇన్‌చార్జి డీపీవో నాగలత తదితరులు



గుడిమెట్ల శ్రీలక్ష్మి (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బొబ్బిల్లంక గ్రామ పంచాయతీ కార్యదర్శి గుడిమెట్ల శ్రీలక్ష్మి(40) శనివారం రాత్రి 7 గంటల సమయంలో కాతేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. గుడిమెట్ల శ్రీలక్ష్మి కాతేరు శివారున ఉన్న అపార్టుమెంట్‌లో తల్లి, తమ్ముడు, మరదలతో కలిసి ఉంటున్నారు. బొబ్బిల్లంక పంచాయతీలో విధులు ముగించుకుని శనివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అనంతరం మందులు కొనుగోలు చేసేందుకు స్కూటీపై రాజమహేంద్రవరం బయలుదేరారు. రాత్రి ఏడుగంటల సమయంలో కాతేరు కోకోకోలా డిపో ఎదురుగా ముందు వెళ్తున్న ట్రాక్టరును తప్పించే ఎదురుగా వాహనాలు రావడంతో ఒక్కసారిగా పక్కకు జరిగారు. ఆ ప్రయత్నంలో ట్రాక్టర్ వెనుక చక్రం కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో సంఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీలక్ష్మి సోదరుడు గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద విషాదఛాయలు

ఎప్పుడూ నవ్వుతూ అందరితో కలుపుగోలుగా ఉండే శ్రీలక్ష్మి మృతి వార్త తెలియగానే సచివాలయంలోని సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు విధి నిర్వహణలో ఉండి ఇంటికి వచ్చిన ఆమె మృత్యువాత పడ్డారన్న విషయం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, రూరల్ ఈవోపీఆర్ అండ్ ఆర్డీ పి.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ప్రమాద సంఘటనను అడిగి తెలుసుకున్నారు. శ్రీలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా..శ్రీలక్ష్మి గత నెలలోనే కొరుకొండ మండలం బొల్లెద్దుపాలెం నుంచి బొబ్బిల్లంక పంచాయతీకి బదిలీపై వచ్చారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ

రాజానగరం: ప్రాథమిక విద్యను మరింతగా బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొమ్మూరులోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎఎం జయశ్రీ అన్నారు. కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 4న మొదలైన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. వీటికి కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఒకటి, రెండో తరగతి బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు. ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి పి.రాంబాబు, రాష్ట్ర పరిశీలకుడు ఎ.ప్రభాకర్ ప్రసంగించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శిక్షణ పర్యవేక్షకులుగా కేఆర్‌పీలు గంగాధర్, జానకీదేవి, మామిడిశెట్టి రాంబాబు, శిక్షణ ఇచ్చే డీఆర్పీలుగా ఎస్‌పీఎన్ సత్యప్రసాద్, పరంశెట్టి సత్యనారాయణ, టి.కల్యాణి, షేక్ మగ్బుల్ బాషా, డి.మహేష్, కె.కృపావతి, బి.శంకర్రావు, వి.ప్రసాద్, జీవీవీఎస్‌కే గుప్తా, ఎ.గణేష్, శీలం సత్యశ్రీనివాసరావు, సీహెచ్.ఏడుకొండలు, కె.బాలకృష్ణ వ్యవహరించారు.

రేపు భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని తాటిపాక మధు పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం దేవీచౌక్, మల్లయ్య పేట, రాజా థియేటర్ ప్రాంతాలలో పోస్టర్లు పంపిణీ చేశారు. మధు మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా దొరికే ఇసుక గత ఐదు మాసాలుగా అందుబాటులో లేదన్నారు. ఇసుక లేని కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పూర్తిగా ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో వారందరూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

14న వివిధ వస్తువులకు బహిరంగ వేలం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) రాజమహేంద్రవరం డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ (ఇన్‌చార్జి)ఎం.అబ్దుల్ ఖదీర్ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ పక్కన ఏపీఐసీసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని దాసరి సీతా రామకృష్ణ గోడౌన్ వద్ద వేలం జరుగుతుందన్నారు. ఈ వేలంలో 134 ఫ్రీజర్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.22,680), 130 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.18,630), 145 కాష్‌చెస్ట్‌లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.6,120), 145 స్కానర్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.3,400), 145 కాష్ కౌంటింగ్ మెషీన్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.810) వేలం వేయడం జరుగుతుందన్నారు. ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడే ప్రకారంగా వేలం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి, దరఖాస్తు రుసుంగా రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాట పాడకొని ఎడల దరఖాస్తు రుసుమును తిరిగి చెల్లిస్తారన్నారు. పూర్తి సమాచారం కోసం 96767 14547, 99493 51052 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి



వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో శెట్టిబలిజ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ధవళేశ్వరంలో శనివారం జరిగిన శెట్టిబలిజ సంఘ వనసమారాధనకు ఆయన, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాటన్ మ్యూజియంలో ఈ కార్యక్రమం జరిగింది. మజ్జి పద్మావతి, అనుసూరి పద్మలత, వాసిరెడ్డి రాంబాబు, పాలిక శ్రీను, శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తిన ప్రసాద్, కార్యదర్శి దొమ్మేటి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



ఓటు నమోదు కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు స్పెషల్ సమ్మరీ డివిజన్లో భాగంగా ఓటు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తొర్రేడు మండల ప్రజా పరిషత్ స్కూల్ ఆవరణలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు కల్పించాలని లక్ష్యంతో ప్రత్యేక సమ్మరీ రివిజన్ చేపట్టామన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ఓటరు నమోదు కేంద్రాల్లో ఫారం 6 అందుబాటులో ఉంచామన్నారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు చిరునామా మార్పు, పేరులో తప్పులు, మార్పులు, చేర్పులు కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. 18 ఏళ్ల నిండిన యువతకు ఈ ఏడాది నాలుగు సార్లు ఓటుకు నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా చందన నాగేశ్వర్ జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ జన్మదిన వేడుకలను శనివారం ఆయన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజకవర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడవద్దన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తున్నారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగుల వితరణ



పరుపులు అందజేసిన ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ స్టేట్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహం–2 బాలికలకు శనివారం 30 ఫోం పరుపులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ పెన్షనర్ల అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆదివిష్ణుమూర్తి మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో కూడా తమ సంఘం తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బి.జార్జి ఆంథోనీ, మోహన్ చంద్, మోహన్ దాస్, మురళీమోహన్, ఐ.రాజేష్, వసతి గృహం సంక్షేమాధికారి టి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభం




రిబ్బన్ కత్తిరించి పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖాధికారి వాసుదేవరావు

ప్రకాశం నగర్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను శనివారం ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం కలిగిస్తాయన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి 13 జట్లు పోటీలకు వచ్చాయన్నారు. శని, ఆదివారాలు పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులందరికీ వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పరిశీలకులు తంబి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, నాగరాజు, ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, రమాదేవి పాల్గొన్నారు.

నర్తించిన నవదుర్గలు

ఆకట్టుకున్న సంగీత, నృత్యనీరాజనం



జానపద నృత్యం చేస్తున్న కళాకారిణులు

సీటీఆర్ఐ: ఉమా నృత్యనికేతన్ ఆధ్వర్యంలో మంజీర పద నృత్యోత్సవ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న సంగీత, నృత్య నీరాజనం రెండోరోజు శనివారం కొనసాగింది. కార్తిక మాసంలో నటరాజుకు సంగీత, నృత్య నీరాజనం అందించాలని ఉమా నృత్యనికేతన్ సంకల్పించింది. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కార్తిక మాసంలో సప్తమ వారికోత్సవం సందర్భంగా ఈ నీరాజనం ప్రారంభించింది. కూచిపూడి నాట్యచారిణి రెడ్డి ఉమారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాభినయం, జానపద నృత్యాలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన మీనాక్షి ఇనిస్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురుశ్రీ జీవీ మోహనరావు బృందం నిర్వహించిన నవదుర్గల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం జగ్గంపేటకు చెందిన ముళ్లపూడి ఈశ్వరి కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.



ఆకట్టుకున్న ప్రదర్శన



నవదుర్గల నృత్యాభినయం